బాధితులకు మానవత ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నల్లజర్ల

మండల మానవతా సంస్థ ఆధ్వర్యంలో నలుగురు అనారోగ్య బాధితుల కుటుంబాలకు రూ.22 వేలను అందించారు. ప్రమాదవశాత్తు కాలు కోల్పోయిన తూర్పు చోడవరం గ్రామానికి చెందిన ఉప్పాడ నాగేశ్వరరావుకు కృత్రిమ కాలు అమర్చేందుకు రూ.10 వేలు, అదే గ్రామానికి చెందిన పెద్దముత్తి ఏసురత్నంకు రూ.4 వేలు, పోతవరం గ్రామానికి చెందిన ఆలూరి వీరమణికి రూ.4 వేలు, నల్లజర్ల గ్రామానికి చెందిన షేక్ వమీనాకు రూ.4 వేలు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మండల మానవతా కమిటీ అధ్యక్షుడు ఐడివి అప్పారావు, భోగవల్లి వెంకట సుబ్బారావు, వైసిపి నాయకులు మద్దిపాటి ప్రసాదు, గుళ్లపూడి వెంకటరత్నం, గుత్తికొండ వరప్రసాద్, రాజేంద్రప్రసాద్, ఆలీ సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

పునరామోసం

- ఆర్ అండ్ ఆర్ కాలనీలో సమస్యల తిష్ట
- రెండేళ్లుగా తప్పని తాగునీటి కష్టాలు
- ఆందోళనలో పోలవరం నిర్వాసితులు

పోలవరం ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో సమస్యలు తిష్ట వేశాయి. పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని చట్టాలు ఉన్నా అవి నీటి మీద రాతలుగా మిగిలిపోతున్నాయి. కాలనీల్లో గృహాలను నిర్మించి రెండేళ్లు గడిచినా నేటికీ నిర్వాసితులను తాగునీటి సమస్య వెంటాడుతూనే ఉంది. పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. ఓవైపు అప్రకటిత విద్యుత్ కోతలు, మరోవైపు దొంగల భయం నిర్వాసితులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

గోకవరం మండలం కృష్ణునిపాలెంలో దేవీపట్నం నిర్వాసితులకు కేటాయించిన పునరావాస కాలనీ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి, గోకవరం

బహుళార్థక సాధక ప్రాజెక్టు అయిన పోలవరం ప్రాజెక్టులో సర్వం కోల్పోయిన నిర్వాసితులు నేడు అష్టకష్టాలను అనుభవిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల దేవిపట్నం మండలంలోని 36 గ్రామాల నిర్వాసితుల్లో గిరిజనేతరులకు కృష్ణునిపాలెంలోనూ, గిరిజనులకు దేవిపట్నం, గోకవరం మండలాల్లో 14 పునరావాస కాలనీలు నిర్మించి పునరావాసం కల్పించారు. ఈ కాలనీలు నిర్మించి రెండేళ్లు గడిచినా ఇప్పటికీ కనీస మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా అడుగులు పడిన దాఖలాలు లేవు. ఈ కాలనీలను స్థానిక పంచాయితీల్లోకి విలీనం చేయకపోవటమే ఈ దుస్థితి కారణమని బాధితులు పేర్కొంటున్నారు. ఇందుకూరుపేట-1 పునరావాస కాలనీ (షెడ్యూలు కాలనీ)లో గతేడాది కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటించి నిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని నిర్వాసితులకు భరోసా ఇచ్చారు. కాలనీల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయినా పరిస్థితుల్లో ఏమాత్రం మార్పు రాలేదని నిర్వాసితులు వాపోతున్నారు.

వేసవి ముందే ఎక్కిళ్లు

పునరావాస కాలనీల్లో వేసవికి ముందే ఎక్కిళ్లు మొదలయ్యాయి. దేవిపట్న మండలంలో కొండమొదలు లోని 6 గ్రామాలు మినహా మిగి లిన 38 గ్రామాలను 14 ఆర్ అండ్ ఆర్ (పునరావాస) కాలనీలకు తరలించారు. ఈ కాలనీల్లో కుళాయిలకు ప్రత్యామ్నాయంగా ఎక్కడా కూడా చేతి పంపులు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. ఉదాహరణకు పెద్ద భీంపల్లి-2 కాలనీలో 67 గృహాలు నిర్మించగా 40 గిరిజన కుటుంబాలకు పునరావసం కల్పించారు. కుళాయి నీరు రెండ్రోజులకోసారి ఇస్తున్నారు. అదే ప్రాంతంలోని చిన్నారి గండి గ్రామంలో వాటర్ ట్యాంక్ గేటు వాలు పగిలిపోయి ఈ వారంలో నాలుగు రోజులపాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చాపరాల పల్లిలో కూడా అదే పరిస్థితి నెలకొంది. నిర్వాసితుల విజ్ఞప్తుల నేపథ్యంలో ఎట్టకేలకు ఇటీవల సోలార్ బోరు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో సత్య సాయి ట్రస్టు అంద జేసే తాగునీటి కోసం పెద్ద భీంపల్లి-2 వాసులు రోజూ కిలోమీటరు దూరం నడిచి తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అదే విధంగా గిరిజనేతరులకు గోకవరం మండలంలోని కృష్ణునిపాలెం ఆర్ అండ్ ఆర్ కాలనీలో 1065 కుటుంబాలకు గృహాలు కేటాయించారు. తాగునీటి కోసం ద్విచక్ర వాహనంపై 2 కిలోమీటర్లు దూరంలోని గోకవరం వెళ్లాల్సివస్తుంది. ఇక్కడ ఒంటరి మహిళలు, వృద్ధుల పరిస్థితి దయనీయంగా మారింది.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో చీ'కట్'లు

పునరావాస కాలనీల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయి. అప్రకటిత విద్యుత్ కోతలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రతి రోజూ ఉదయం కనీసం 2 నుంచి 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. గత వారంలో రాత్రివేళ 3 గంటలపాటు విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో నిర్వాసితులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కృష్ణుణిపాలెం ఆర్ అండ్ ఆర్ కాలనీలో 18 గ్రామాల వాసులకు పునరావాసం కల్పించారు. అయితే మంటూరు, మడిపల్లి వాసుల కాలనీలో మాత్రమే వీధి దీపాలకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. మిగిలిన గ్రామాల ప్రజల వీధుల్లో సాయంత్రం 6 గంటలకే చీకట్లు కమ్ముకుంటున్నాయి. షెడ్యూలు కాలనీలైన పెద్దబీంపల్లి-1,-2,-3 కాలనీల్లోనూ వీధి దీపాలు వెలగడం లేదు. మరో వైపు పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవటంతో ఎక్కడికక్కడే చెత్త నిలిచిపోతోంది. ఈ సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండటం లేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటికి తప్పని ఇబ్బందులు

దేవిపట్నం తొయ్యేరులో నివాసం ఉండే వాళ్లము. కృష్ణునిపాలెంలో పునరావాసం కల్పించారు. ఆ ప్రాంతంలో కుళాయిలకు రెండ్రోజుల నుంచి నీరు రావడం లేదు. చేతిపంపులు కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాము. తాగునీటి కోసం గోకవరం వెళ్లాల్సివస్తుంది. ఒంటరి మహిళలకు తాగునీరు తెచ్చుకునే పరిస్థితి లేకుండా పోతుంది. మరో వైపు దొంగల భయం వెంటాడుతోంది. పారిశుధ్య నిర్వహణ సరిగా లేదు. కాలనీలో ఎక్కడి చెత్త అక్కడే నిలిచిపోతోంది. పంచాయతీ సిబ్బందికి సమాచారం ఇచ్చినా స్పందించడం లేదు. దీంతో దోమల పెరిగిపోయి రోగాల భారిన పడుతున్నాము.

- దేవిశెట్టి శకుంతల, కృష్ణునిపాలెం, కాలనీ

నిరంతరం విద్యుత్ కోతలే...

పెద్ద భీంపల్లి-2లో ప్రభుత్వం పునరావాసం కల్పించింది. కాలనీలో కుళాయిలు ఉన్నప్పటికీ నీరు రావడం లేదు. కొన్నిసార్లు నీరు ఇచ్చినా అవి ఉప్పుగా ఉండటంతో తాగలేకపోతున్నాయి. ప్రతి రోజూ సత్యసాయి ట్రస్టు నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నాం. తరచూ విద్యుత్ అంతరాయాలు తలెత్తుతున్నాయని విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా సకాలంలో స్పందించడం లేదు. పునరావాస కాలనీల్లో అభివృద్ధి కమిటీ సమావేశాల్లో సమస్యలు ప్రస్తావించినా ఫలితం ఉండటం లేదు.

-కారం రామన్న దొర, పెద భీంపల్లి -2 కాలనీ

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత, ఎస్‌పి జగదీష్, కమిషనర్ దినేష్‌కుమార్

ఎన్నికలు సజావుగా సాగేలా చర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

వచ్చే సార్వత్రిక ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి సంబంధించి అన్ని చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్, ఎస్‌పిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ విసి హాల్ నుంచి కలెక్టర్ మాధవీలత, ఎస్‌పి పి.జగదీష్, మునిసిపల్ కమిషనర్ కె.దినేష్ కుమార్, డిఆర్ఒ జి. నరసింహులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె. మాధవీలత మాట్లాడుతూ కొత్త జిల్లాల ఏర్పాటు తరువాత జరుగుతున్న 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పూర్వపు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి నియోజక వర్గాల వారీగా సమగ్ర నివేదికను సేకరించడం జరిగిందని తెలిపారు. అందుకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల సమగ్ర సమాచారం మేరకు అవసరమైన మానవ వనరులతోపాటు పోలీసు భద్రత, తదితర అంశాలపై నివేదిక రూపొందించడం జరుగుతోందని అన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులతో నియోజక వర్గాల వారీగా సమన్వయం చేసుకోవడం జరుగుతుందని వివరించారు. నూతన తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలోని 1569 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఎస్ఎస్ఆర్ 2024 ఓటరు జాబితా కోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న 1569 పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు జాబితా అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. నవంబర్ 4, 5 శని ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలను ఫారం 6, తొలగింపులకు చెంది ఫారం 7, మార్పులు, చేర్పులకు చెంది ఫారం 8లను స్వీకరించడం కోసం అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ సమావేశంలో కొవ్వూరు ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఎంఎల్ఎ శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని సూర్యారావుపాలెంలో గ్రామ రజకుల సంఘం ఆధ్వర్యంలో పున్ణనిర్మిస్తున్న సంపత్ శ్రీ వినాయక స్వామి ఆలయ నిర్మాణానికి నిడదవోలు ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు శుక్రవారం శంకుస్థాపన చేశారు. పాత ఆలయం శిధిలావస్థకు చేరుకోవడంతో నూతన ఆలయానికి అంకురార్పణ చేసినట్లు సంఘ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి ఎన్.భాస్కర రామయ్య, మండల జెసిఎస్ ఇన్‌ఛార్జ్ కఠారి సిద్ధార్థ రాజు పాల్గొన్నారు.

కమిటీ సభ్యులతో ఎంఎల్ఎ శ్రీనివాస నాయుడు

టిడిపి విజయం తథ్యం

ప్రజాశక్తి - గోకవరం, సీతానగరం

మండల కేంద్రమైన గోకవరంలో మండల టిడిపి అధ్యక్షులు మంగరౌతు రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విఎస్ అప్పలరాజు, మాజీ జడ్‌పిటిసి పాలూరి బోసుబాబు, కంచుమర్తి రాఘవ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్ల మహానాడు వేదికగా చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని పథకాలను వివరించారు. టిడిపి అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ప్రజల నెత్తిన ఆర్థిక భారాన్ని మోపిన జగన్ రెడ్డికి రాబోయే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపు నిచ్చారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గునిపె భరత్, కోట సత్తిబాబు, మేడిశెట్టి వీరబాబు, అడబాల సింగరయ్య, దిండి రాజు, బాలస, సునీల్, కోట సత్యవతి, తదితరులు పాల్గొన్నారు. సీతానగరంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ఇంటింటా తిరిగి టిడిపి మినీ మేనిఫెస్టోలో సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి విజయ ఢంకా మోగించి, ప్రజలకు అవినీతి రహిత పరిపాలన అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వలవల రాజా, పెందుర్తి అచ్యుత రామారావు, పల్లి శశికళ, గద్ద సురేష్, చంటి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఫుడ్ కమిషన్ సభ్యుల తనిఖీలు

ప్రజాశక్తి - కడియం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు జక్కంపూడి కృష్ణకిరణ్ మండలంలోని పలు పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం తనిఖీలు చేశారు. కడియం ప్రాథమిక పాఠశాల -2లో మధ్యాహ్న భోజన రికార్డులు పరిశీలించి, భోజనాన్ని రుచిచూచి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే కడియం జడ్‌పి హైస్కూల్లో విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. హైస్కూల్ నందు 850 మంది విద్యార్థులుండగా, 469 మంది విద్యార్థులు మాత్రమే భోజనం చేయడంపై హెచ్‌ఎంను ప్రశ్నించారు. భోజనం చేసే విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారని ఎంఇఒ లజపతిరాయ్ తెలిపారు. ఈ పర్యటనలో ఎండిఎం ఎడి వి.వెంకట్రాజు, సూపరింటెండెంట్ టి.శ్రీనివాస్, ఎంఎస్ఒ ప్రభాకరరావు, సిడిపిఓ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నిత్యవసర వస్తువుల గదిని తనిఖీ చేస్తున్న కృష్ణకిరణ్

శిక్షణ కోసం క్రీడాకారుల ఎంపిక ప్రారంభం

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో నేషనల్ అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంప్ సెలక్షన్స్‌ను విసి ఆచార్య కె.పద్మరాజు శుక్రవారం ప్రారంభించారు. క్యాంపు సెలక్షన్స్‌కు విశ్వవిద్యాలయంతోపాటు అనుబంధ కళాశాలల ఎన్ఎస్ఎస్ విభాగాల వలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విసి పద్మరాజు మాట్లాడుతూ కేంద్ర యువజన వ్యవహారాలు అండ్ క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతి ఏడాది జాతీయ స్థాయి ప్రసిద్ధ శికణా సంస్థల్లో సాహస శిక్షణ పొందేందుకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, పిఒలకు కంటిజెంట్ లీడర్‌ల కోసం సాహస శిక్షణా శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. ఈ శిక్షణలో ప్రతిభకనపరచిన విద్యార్థుల్లో 5గురిని, విద్యార్థినుల్లో 5గురిని ఎంపిక చేసి నేషనల్ అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంప్‌కు పంపిస్తామన్నారు.

రన్నింగ్ పోటీలు ప్రారంభిస్తున్న విసి పద్మరాజు

సత్యనారాయణ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - బిక్కవోలు

హైస్కూల్ అటెండర్‌గా సత్యనారాయణ చేసిన సేవలు అభినందనీయమని ఎంఎల్‌ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. బలబద్రపురంలో సబ్బెళ్ళ బుల్లియ రెడ్డి ఉన్నత పాఠశాలలో అటెండర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన జొన్నాడ సత్యనారాయణ దంపతులను వైసిపి నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ పాఠశాలలో ఉపాధ్యాయులతోపాటు, విద్యార్థులతోనూ, గ్రామ పెద్దలతోనూ, ఎంతో ఉన్నతంగా, స్నేహభావంతో కలిసిమెలిసి పనిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఎస్.వెంకటరెడ్డి, సర్పంచ్ బి.రామారావు, ఎంపిటిసి సభ్యులు ఎస్.సుజాత, ఎం.ఆనంద్ రెడ్డి, సిహెచ్ వీర రాఘవరెడ్డి, ఎస్.వీర రాఘవరెడ్డి హైస్కూల్ ఛైర్మన్ ఎం.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

ప్రజాశక్తి - చాగల్లు

రోటరీ యువజన మాస ఉత్సవంలో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్ టౌన్ ఆధ్వర్యంలో స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు గుంపుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ గవర్నర్ పర్యటన రోజున విజేతలకు బహుమతుల ప్రధానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వీర్రాజు, రోటరీ ట్రెజరర్ టి.సత్తిరాజు, రోటేరియన్స్ ఐ.శేఖర్, జి.సత్యప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు జె.విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్నసర్పంచ్ జ్యోతి

అదనపు భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - నల్లజర్ల

నల్లజర్లలోని స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి ఆవరణలో అదనపు 6 పడకల అత్యవసర వార్డు భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ పల్లి జ్యోతి శుక్రవారం శంకుస్థాపన చేశారు. రూ.9.83 లక్షలతో భవన నిర్మాణ పనులు జరుగుతాయని డాక్టర్ టి.గంగాధర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కె.రమేష్, వైసిపి నాయకులు ఎం.ప్రసాద్, వెంకట రత్నం, అప్పారావు, పిఆర్ఎ ఇ.వినోద్ కుమార్ డాక్టర్ సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జెకెసి

ప్రజాశక్తి - సీతానగరం

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకే జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జెసి ఎన్.తేజ్ భరత్ అన్నారు. స్థానిక జెవికె ఫంక్షన్ హాల్లో శుక్రవారం మండల స్థాయి జెకెసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెసితోపాటు, ఎంఎల్ఎ జక్కంపూడి రాజా, సహాయ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు.. ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కొరకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టి అమలు చేస్తుందన్నారు. ఎంఎల్ఎ జక్కంపూడి రాజా మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం, అవినీతి రహిత పాలన దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. సమాజంలో సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ అట్టడుగు వర్గాల ప్రజలను ఆదుకోవాలని లక్ష్యంతో రేషన్ కార్డు, పెన్షన్, కార్పొరేషన్ రుణాలను నేరుగా లబ్ధిదారుని ఇంటి వద్దకే వచ్చి సంక్షేమ పథకాలు ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారులు వి.స్వామినాయుడు, డాక్టర్ కె.వేంకటేశ్వరరావు, డాక్టర్ ఎమ్. సనత్ కుమారి, ఎస్. మాధవరావు, ఎస్‌జిటి సత్యగోవిందం, పి.జగదాంబ, కె. విజయ కుమారి, ఎస్. అబ్రహం, వీణాదేవి, వి.నాగార్జున రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న జెసి, ఎంఎల్ఎ జక్కంపూడి

అన్నదానంలో భక్తులు

అన్న సమారాధన

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని ఖండవల్లి జాతీయ రహదారి పక్కన శరన్నవరాత్రి ముగింపు ఉత్సవాల సందర్భంగా శుక్రవారం అన్న సమారధన జరిగింది. సుమారు 5 వేల మంది భక్తులు అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారని నిర్వాహణ కమిటి వెల్లడించింది. ముక్కామల, అన్నవార్పడు, నల్లాకులవారిపాలెం, కొత్తపల్లి, అగ్రహారం, పెరవలి, కె.కుముదవల్లి తదితర గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

సంతృప్తికరంగా ఎస్ఇఎఎస్ పరీక్షలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

విద్యా విధానం, విద్యార్థుల్లో విద్యా స్థాయి మదింపు చేసే కార్యక్రమంలో భాగంగా స్కూల్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వేను జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ నరసింహారెడ్డి శుక్రవారం పరిశీలించారు. మండలంలోని 26 పాఠశాలలు, 46 క్లాసుల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులకు తెలుగు, లెక్కలు పాఠ్యాంశాలలో పరీక్ష నిర్వహించారు. తణుకు, వేలివెన్ను శశి కళాశాల డిగ్రీ విద్యార్థులు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా, మండల విద్యాశాఖ అధికారి 1, 2లు సిహెచ్ సక్సేనా రాజు, డి.శారదా జ్యోత్స్నల పర్యవేక్షణలో ఈ పరీక్షలు నిర్వహించారు. దమ్మెన్ను, మోర్త ఉన్నత పాఠశాల, మోర్త నవోదయ పాఠశాలలలో పరిశీలన చేసి, నరసింహారెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జల వనరుల గణన చేపట్టాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి, గోపాలపురం

గ్రామాల్లో చెరువులు, చెక్ డాములు, ఊట చెరువులు, జలాశయాలు వంటివి గణన చేయాలని జల వనరుల గణన శిక్షకులు ప్రోగ్రాం కన్వీనర్ జోడాల వెంకటేశ్వరరావు సూచించారు. తహశీల్దార్ టి.రాధిక ఆధ్వర్యంలో జల వనరుల గణన కార్యక్రమంపై గ్రామ రెవెన్యూ అధికారులకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 16 రకాల ప్రశ్నలతో ఈ సర్వే నిర్వహించాలన్నారు. వ్యక్తిగత, పారిశ్రామిక, మత్స్య, నీటిపారుదల, గృహ సంబంధ, భూగర్భ జలాలను పెంచుటకు తదితర వాటర్ బాడీలను గణన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒలు ప్రవీణ్, నాగేశ్వరరావు, సుజాత, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు. గోపాలపురం మండల తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఒలకు వాటర్ బాడీ గణన శిక్షణ కార్యక్రమం జరిగింది. ప్రోగ్రాం కన్వీనర్ జోడాల వెంకటేశ్వరరావు పాల్గొని వివరించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒలు లక్ష్మి, శ్రీను, సూర్యారావు, గొంటియ్య, రాంబాబు, కాంతారావు పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం, దేవరపల్లి

రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉండ్రాజవరం మండల తహశీల్దార్ జి.కనకరాజు తెలిపారు. మండలంలోని 58 పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవెల్ అధికారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఓటు నమోదు, తొలగింపు, సవరణ తదితర కార్యక్రమాల కొరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఓటర్లు తమ ఆధార్ డేటాను, ఓటర్ ఐడి కార్డుతో అనుసంధానం చేసుకొనేందుకు అవకాశం ఉందన్నారు. దేవరపల్లి మండలంలో ఈ నెల 4, 5 తేదీల్లో ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహశీల్దార్ మాదాసు రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు వయస్సు నిండిన ప్రతీ ఒక్కరూ తమ ఓటును పొందేందుకు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కార్టూ'నిజం'



కొనసాగుతున్న జెఎఎస్ శిబిరాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం జరిగిన జెఎఎస్ శిబిరాల్లో వైద్య సేవలు అందించి అవసరమైన రోగులకు మందులను ఉచితంగా అందించారు. **రాజమహేంద్రవరం రూరల్** మండలంలోని ధవళేశ్వరంలో సచివాలయం-2 వద్ద జరిగిన జెఎఎస్ శిబిరంలో రూరల్ నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో ధవలేశ్వరం పంచాయతీ గ్రేడ్ వన్ సెక్రటరీ సూరిబాబు, సచివాలయాల కన్వీనర్లు తలారి. వరప్రసాద్,, పేర్ల. దుర్గాప్రసాద్. పసుపులేటి .దేవి, నాయకులు హమీద్ భాషా, షట్టర్ భాషా, దేవులపల్లి. సరిత రాణి, మెండ. రాజేష్, చప్పిడి. జ్యోతి, బర్రె. సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు. **గోపాలపురం** మండలంలోని దొండపూడిలో జెఎఎస్ కార్యక్రమాన్ని సర్పంచ్ మల్లిపూడి అచ్చిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు పాల్గొని మాట్లాడారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, జడ్‌పిటిసి కె.లలిత, వైసిపి మండల అధ్యక్షుడు పోతిరెడ్డి నాగరాజు, ఎంపిటిసి మారాజు రాజేష్, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మందుల కిట్లను పంపిణీ చేస్తున్న చందన నాగేశ్వర్

పోస్టల్ కార్యాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని కొవ్వూరుపాడు పోస్టల్ కార్యాలయాన్ని తాడేపల్లి గూడెం పోస్టల్ సూపరింటెండెంట్ సి. వెంకట రామిరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలో ఒకటి హెడ్ పోస్ట్ ఆఫీస్, 35 సబ్ పోస్ట్ ఆఫీసులు, 193 బ్రాంచ్ పోస్ట్ ఆఫీసులు ఉన్నాయని తెలిపారు. ప్రతి పోస్ట్ ఆఫీస్ పనితీరు, లావాదేవీలు తప్పనిసరిగా ఆడిట్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇన్సూరెన్స్, ప్రీమియం, సేవింగ్స్ (ఆర్.డి), సుకన్య, ఫిక్స్ డిపాజిట్, అకౌంట్స్ లావాదేవులు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఖాతాదారుల పాస్ బుక్కులకు ఆన్‌లైన్‌లో జమ చేసిన నగదు వివరాలను పరిశీలించినట్లు చెప్పారు. ఈనెలాఖరు వరకూ పోస్టల్ స్పెషల్ డ్రైవ్ దేశమంతటా జరుగుతుందని వివరించారు. ఈ డ్రైవ్‌లో తపాలా శాఖ ద్వారా ఇన్సూరెన్స్, డిపాజిట్లు వడ్డీ రేట్ల యొక్క వివరాలను ప్రజలకు వివరిస్తున్నట్లు చెప్పారు. తపాలా శాఖలో ప్రీమియం తక్కువగా ఉంటుందని, బోనస్ మాత్రం అధికంగా ఉంటుందని తెలిపారు. ఒక ఏడాది నుంచి 10 సంవత్సరాలలోపు సుకన్య యోజన ఆడపిల్లలకు ఎంతో ఉపయోగపడుతుందని, అధిక బెనిఫిట్ కలుగుతుందని వివరించారు. ఈ తనిఖీలలో స్టెనో సిహెచ్ రాజేష్ బాబు, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ చిలకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తనిఖీ చేస్తున్న సూపరింటెండెంట్ వెంకట రామిరెడ్డి

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు, ఆలమూరు

వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం లచ్చి పాలెం జంక్షన్ సమీపంలో 216 జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. హైవే పోలీసులు తెలిపిన వివరాల మేరకు కాకినాడకు చెందిన పినపోతు రాంబాబు కాజులూరులోని తన అత్తవారి ఇంటికి వెళ్లాడు. తిరిగి కాకినాడ వెళ్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రాంబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. హైవే పోలీసులు ఆయన్ని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని చొప్పెల్ల లాకుల సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. హైవే పెట్రోలింగ్ పోలీసులు తెలిపిన వివరాలు...కడియం మండల కేంద్రానికి చెందిన పొడుగుమాటి తేజ కపిలేశ్వరపురం మండలం తాతపూడిలో వెల్డింగ్ పని చేసుకుంటున్నాడు. తన పని ముగించుకుని స్వగ్రామం బైక్‌పై వెళ్లే క్రమంలో ఎదురుగా వెళ్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు మధ్యలో గల డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తేజ తీవ్రగాయలపాలయ్యాడు. క్షతగాత్రుని హైవే అంబులెన్స్‌పై రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. కాగా అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్య సిబ్బంది తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వెంకటేశ్వర స్వామి గుడి సమీపంలో ఉన్న ట్రాన్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మహిళా మతి చెందింది. స్థానిక వక్కలంక వారి వీధికి చెందిన కోటిపల్లి వెంకటలక్ష్మి (46)అనే మహిళ సినిమా సెంటర్ వైపు వెళుతుండగా గేదెలు ఎదురుగా రావడంతో పక్కకు తప్పుకుని ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకుంది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడికే మృతి చెందింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తగలించారు. ఎస్ఐ వి.సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం మండలంలోని వేలంపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇరువురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ భుజంగరావు తెలిపారు. చప్పిడి సత్యనారాయణ అనే వ్యక్తి 9 బ్రాందీ సీసాలతో అదుపులోకి తీసుకున్నామని, అలాగే ములకల అన్నవరం అనే వ్యక్తి వద్ద నుంచి మూడు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరిద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - గోకవరం

షార్ట్ సర్క్యూట్ కారణంగా తాటాకు ఇల్లు దగ్ధమైంది. స్థానికులు కథనం ప్రకారం.. .మండలంలోని గంగంపాలెం పంచాయతీ పరిధి ఠాకూర్ పాలెం గ్రామానికి చెందిన యలంపర్తి చిన్నాల దొరకి చెందిన తాటాకు ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల పూర్తిగా దగ్ధం అయింది. ఇంటి యజమాని కుటుంబీకులు కట్టుబట్టలతో మిగిలారు. ఆస్తి నష్టం సుమారు రూ.3 లక్షలపైనే ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం తగినరీతిలో నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కుటుంబీకులు కోరారు. సంఘటనా ప్రాంతాన్ని తహశీల్దార్ శ్రీనివాస్ సందర్శించారు. అలాగే మండల సచివాలయల కన్వీనర్ దాసరి రమేష్, సుంకర వీరబాబు అగ్నిప్రమాదం బాధిత కుటుంబాన్ని పరామర్శించి కూరగాయలు, బియ్యం, వంట సామాగ్రి, కొంత నగదును అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దొడ్డి నాగేశ్వరరావు, చింతల అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితులకు ధైర్యం చెప్పి బియ్యం, బట్టలు, వంట సామాన్లు, రూ.5 వేలు నగదు ను అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్‌విఎస్ అప్పలరాజు, ఉంగరాల రాము, పిల్లా చంటిబాబు, కొత్త కొండబాబు, కంచుమర్తి రాఘవ, సాలాపు నలమహారాజు, ఉంగరాల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడు అరెస్టు

ప్రజాశక్తి - ఆలమూరు

మద్యం బెల్ట్ షాపు నిర్వాహకుని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఎస్ఐ ఎల్.శ్రీను నాయక్ తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని కొత్తూరు సెంటర్లో బెల్ట్ షాప్ నడుపుతున్నట్టుగా ముందస్తు సమాచారంతో బెల్ట్ షాపుపై దాడి చేశామన్నారు. ఈ దాడిలో గుత్తుల వీర వెంకటరమణ వద్ద 12 నిబ్బుల మందు సీసాలతోపాటు అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై కులదూషణ కేసు నమోదు

ప్రజాశక్తి - బిక్కవోలు

కులం పేరుతో దూషించి చంపేస్తానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు బిక్కవోలు ఎస్ఐ బుజ్జిబాబు తెలిపారు. బిక్కవోలు గ్రామం రాజారావుపేటకు చెందిన గరగా వెంకటరాజు ఇటీవల ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నాడు. అతనిని పరామర్శించేందుకు గ్రామానికి చెందిన దూళ్ళ రత్నరాజు వెళ్లాడు. అదేసమయంలో అతని వద్ద ఉన్న జల్లూరి వెంకన్న బాబు పరామర్శకు వెళ్లిన రత్నంరాజును మా ఇళ్లకు పరామర్శించడానికి రావడం ఏమిటని ప్రశ్నించి కులం పేరుతో దూషించాడని, మాట్లాడితే చంపేస్తానని బెదిరించినట్లు రత్నరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

'జగనన్న గోరుముద్ద' తనిఖీ

సామర్లకోట రూరల్ : స్థానిక జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం నిర్వహణను ఎంఇఒ వై.శివరామకృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంలో, గుడ్లలో నాణ్యత లోపించిందని ఇటీవల జిల్లా మానవ హక్కుల సంఘం నాయకుల ఫిర్యాదు మేరకు హెచ్ఎం యు.మీనామాధురితో కలిసి ఆయన తనిఖీ చేవారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని రుచిచూశారు. నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ శుక్రవారం పాఠశాలకు హాజరైన 421 మంది విద్యార్థులు భోజనం చేశారన్నారు. ఈ పాఠశాలకు బెండపూడి ఏజెన్సీ నుంచి ఆహారం సరఫరా అవుతుందన్నారు. కోడి గుడ్డు ప్రభుత్వ ప్రమాణాలకు అనుకూలంగా ఉన్నాయన్నారు. తొలుత పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

సామర్లకోట రూరల్ : రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇచ్చేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు జెసి ఎస్.ఇలాక్కియా అన్నారు. పెద బ్రహ్మదేవంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. దళారీ వ్యవస్థను అరికట్టేందుకు ప్రభుత్వం ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కొనుగోళ్లలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ పుష్పవాణి, ఎడిఎ జివి.పద్మశ్రీ, ఎఒ ఇమ్మిడిసెట్టి సత్య, ఎంపిటిసి సభ్యులు మలకల సూర్యారావు (సూరిబాబు), సొసైటీ అధ్యక్షుడు మలకల వరాలబాబు, ఆర్‌బికె సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

4 ,5న ఓటర్ల నమోదు

కరప : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 4, 5తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు చేపట్టామని తహశీల్దార్ పి.శ్రీనివాసరావు తెలిపారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఆలాగే మార్పులు చేర్పులకు అవకాశం ఉందన్నారు.

రైతులకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

సదస్సులో మాట్లాడుతున్న మునిరత్నం

ఏరువాక కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం(విజయవాడ) సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు వరి, అపరాలు, మొక్కజొన్న పంటల సాగు విధానాలపై రెండు రోజులపాటు నిర్వహించే రైతు సదస్సును శుక్రవారం వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ పి.మునిరామయ్య ప్రారంభించారు. అనంతరం జరిగిన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. కేంద్రీయ సమగ్ర సస్య రక్షణా కేంద్రం మొక్కల సంరక్షణాధికారి డాక్టర్ ఒ.వీరబాబు వ్యవసాయ శాస్త్రవేత్తలను వేదికపైకి ఆహ్వానించారు. వ్యవసాయ పరిశోధనా కేంద్రం అధిపతి డాక్టర్ పి.మునిరత్నం వరి, అపరాలు, మొక్కజొన్న పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు యాజమాన్య పద్ధతులు, సస్య రక్షణ, ఎలుకల నివారణ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు, ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్‌వి.నరసింహారావు మాట్లాడారు. ఎలుకల నిర్మూలనపై అవగాహన కల్పించారు. రైతుల ప్రయోజనార్థం ఎలుకల నివారణ,వరిలో బ్యాక్టీరియా ఎండు తెగులు నివారణకు సంబంధించిన సాంకేతిక బులిటెన్‌ను ఆవిష్కరించారు. ఈ సదస్సులో సహాయ మొక్కల సంరక్షణాధికారి డాక్టర్ కె.దక్షిణామూర్తి, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ మానుకొండ శ్రీనివాస్, డాక్టర్ ఎ.సీతారామశర్మ, డాక్టర్ ఐ.సుధీర్ కుమార్, డాక్టర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసం ఏర్పాట్లపై సమావేశం

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం దేవస్థానంలో ఈనెల 14 నుంచి వచ్చేనెల 12 వరకు జరిగే కార్తీక మాసం ఏర్పాట్లపై దేవస్థానం ఇఒ ఎస్.ఆజాద్, చైర్మన్ ఐవి.రోహిత్ ఆధ్వర్యంలో దేవస్థానం, ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్తీకమాసంలో అధిక సంఖ్యలో వచ్చేయాత్రికులకు, వారికి కల్పించాల్సిన సౌకర్యాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడారు. ముఖ్యంగా కార్తిక సోమవారాలు, పౌర్ణమి, ఏకాదశి రోజున పంపాలో నిర్వహించే తెప్పోత్సవం, జ్వాలా తోరణం, గిరి ప్రదక్షిణ వంటి పర్వదినాల్లో వచ్చే యాత్రకుల రద్దీ దృష్ట్యా మరిన్ని పకడ్బందీ ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందన్నారు. అందుకు తగ్గట్టుగా సదుపాయాలు కల్పించే క్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు దేవస్థానం అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులను నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో దేవస్థానం ఎసి రమేష్‌బాబు, పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, ఫిషరీస్, విద్యుత్, పంచాయతీ, అగ్నిమాపక, వైద్య ఆరోగ్యశాఖ ఎపిఎస్‌ఆర్‌టిసి ఇతర శాఖల అధికారులు దేవస్థానం అధికారులు పాల్గొన్నారు

ప్రయివేటు స్థలంలో ప్రభుత్వ భవనాలు

ప్రజాశక్తి- కడియం

ప్రభుత్వ భూముల్ని ప్రయివేటు వ్యక్తులు ఆక్రమించడం, ప్రయివేటు వ్యక్తుల భూముల్ని కొందరు భూబకాసురులు ఆక్రమించడం, దౌర్జన్యంగా స్వాధీనం చేసుకోవడం, నకిలీ పత్రాలు సష్టించి దొంగ రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం లాంటి సంఘటనలు తరచూ చూస్తుంటాం. కాని కడియం మండలంలో దీనికి భిన్నంగా ఒక వ్యక్తికి సంబంధించిన స్థలంలో అధికారుల పర్యవేక్షణలో ప్రభుత్వ భవనాలు నిర్మించడం చర్చనీయాంశమైంది.

మండలంలోని వేమగిరి గట్టు ప్రాంతంలో సర్వే నెంబర్ 354లో గల ప్రభుత్వ స్థలంలో మూడు ప్రభుత్వ భవనాలు నిర్మాణాన్ని ఏడాది క్రితం మొదలు పెట్టారు. సగానికి పైగా పనులు పూర్తి కావొచ్చాయి. జిల్లా ఉన్నతాధికారులు కూడా వీటి నిర్మాణాలను పర్యవేక్షించారు. సుమారు 118 గజాలకు సంబంధించిన సొంత స్థలంలో అక్రమంగా ప్రభుత్వ భవనాలు నిర్మాణం చేపట్టారని, వాటిని వెంటనే తొలగించి న్యాయం చేయాలని స్థల యజమాని కడియం తహశీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ ఫిర్యాదుపై రెవెన్యూ అధికారులు విచారణ చేశారు. ఆక్రమణ జరిగినట్టు నిర్ధారించి నిర్మాణాలు నిలుపుదల చేయాలని, గుత్తేదారునకు బిల్లుల చెల్లింపులు ఆపాలని, ఆక్రమణలు తొలగించాలని ఎంపిడిఒ, మండల ఇంజినీరింగ్ అధికారులకు నోటీసులు ఇచ్చారు. సుమారు రూ.78 లక్షల అంచనాలతో ఈ పనులు చేపట్టారు. రూ.40 లక్షల విలువైన పనులు పూర్తయినట్టు సమాచారం. సచివాలయ భవనం నిర్మాణంలో సుమారు 8 గజాలు స్థలం డీవియేట్ అయినట్లుగా, అది కూడా పుంతరోడ్డుగా నిర్ధారించినట్లు సమాచారం. రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరం, కడియం మండలం వేమగిరి సరిహద్దు ప్రాంతం కావడంతో అప్పట్లోనే ఇరు మండలాల రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేసి స్థలాలను గుర్తించి ఉంటే ఈ సమస్య వచ్చేదికాదని కొందరి వాదన. దీనిపై కడియం తహశీల్దార్ ఎం.సుజాత మాట్లాడుతూ వేమగిరి గట్టు ప్రాంతం సర్వే నెంబర్ 354లో గల సుమారు 6 సెంట్ల ప్రభుత్వ భూమిని గుర్తించి రెండు భవనాల నిర్మాణాల నిమిత్తం సంబంధిత అధికారులకు గతంలోనే అప్పగించామన్నారు. తదుపరి ఇటీవల ఒక వ్యక్తి దరఖాస్తు మేరకు మరల సర్వే చేసి భవన నిర్మాణాలు డీవియేట్ అయినట్లుగా గుర్తించి, సంబంధిత అధికారులకు నోటీసులు ఇచ్చామన్నారు. మండల పరిషత్, మండల ఇంజనీరింగ్ అధికారుల వివరణ కోరగా నిబంధనలు, సరిహద్దులకు లోబడి సర్దుబాటు చేసి భవన నిర్మాణాలు చేపట్టామన్నారు. రాజమండ్రి రూరల్, కడియం మండలాల రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేయాల్సి ఉందన్నారు.

భూమి పూజ చేస్తున్న ఎంపి భరత్, మాజీ ఎంఎల్ఎ రౌతు, అజ్జరపు వాసు

బర్మాకాలనీలో రామాలయం పునఃప్రతిష్టాపన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని 48వ డివిజన్ బర్మా కాలనీలో శ్రీ విఘ్నేశ్వర కోదండరామ సుబ్రహ్మణ్య సాయి సహిత ఆలయ పున:ప్రతిష్టాపన శుక్రవారం జరిగింది. ఎంపీ భరత్‌రామ్, వైసిపి అర్బన్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్, మాజీ ఎంఎల్ఎ రౌతు సూర్యప్రకాశరావు, సిసిసి ఛానల్ ఎమ్‌డి పంతం కొండలరావు, ప్రముఖ పారిశ్రామికవేత్త బివిఎన్.రెడ్డి, వైసిపి నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మాజీ కార్పొరేటర్లు మోకమాటి సత్యనారాయణ, మానే దొరబాబు, స్వర్ణాంధ్ర నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు, తదితరులు పాల్గొని భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు మాట్లాడారు. పురాతన కాలం నాటి ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకుందన్నారు. దాని స్థానంలో ఆలయాన్ని పున:ప్రతిష్టాపన చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని తలపెట్టామన్నారు. ఈ కార్యక్రమం సిద్ధాంతి సత్యనారాయణ, తాడేపల్లిగూడెం రామశర్మ సారథ్యంలో జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు రేలంగి హరీష్, పందిరి వీరబాబు, డి.జగదీష్, తామాడ దుర్గాప్రసాద్, లోకేష్, స్థానికులు ఎల్‌ఐసి కన్నారావు, కుంచె శేఖర్, బంటి, గెడ్డం శ్రీను, బుజ్జి, ధనరాజు, వేణు, వినయ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కోతకు సిద్ధమైన వరిచేలు

- దళారుల ప్రమేయం తగ్గించాలన్న రైతులు
- రవాణా, హమాలీ ఛార్జీలు రైతులకు చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి-రామచంద్రపురం

వరిచేలు

అనేక ఒడిదుడుకులు తట్టుకుని నిలిచిన తొలకరి వరి చేలు పంటకాలం పూర్తయి కోతకు సిద్ధమయ్యాయి. కె.గంగవరం మండలంలోని 16,ఎకరాల్లోనూ, రామచంద్రాపురం మండలంలోని 18 వేల ఎకరాల్లోనూ తొలకరి పంటలు కోతకు సిద్ధమయ్యాయి. ప్రస్తుతం వాతావరణం పంటలకు అనుకూలించినప్పటికీ అల్పపీడ ఐ ద్రోణి ప్రభావంతో గత రెండు రోజులుగా వర్షాలు కురవడంతో కోతలు మరో వారం పాటు వాయిదా పడే అవకాశం ఉంది. నంబరు 12 నుండి కోతలు ముమ్మరంగా ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అయితే తొలకరి పంటకు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంకా ఏర్పాటు చేయకపోవడంతో రైతన్నలు అయోమయానికి గురవుతున్నారు. దీనితోపాటు ప్రభుత్వం ప్రకటిస్తున్న మద్దతు ధర రైతులకు గందరగోళం కలిగిస్తోంది. రైతులు ధాన్యం ట్రాన్స్‌పోర్ట్‌కు, హమాలి చార్జీలు కలిపి బస్తాకు రూ.80 ఖర్చు అవుతుంది. దీనినే రైతుల వద్ద నుంచి కొనుగోలు దారులు వసూలు చేస్తూన్నారు. అయితే ప్రభుత్వం హమాలీ ఛార్జీలకు, ట్రాన్స్‌పోర్ట్‌కు రూ.37 చెల్లిస్తుండగా దాన్ని కూడా ధాన్యం వ్యాపారులే తీసుకుంటున్నారని దీంతో ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న రాయితీలు వర్తించడం లేదని పలువు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలులో పేరుకు మాత్రమే పిఎసిఎస్ లు వ్యవహరిస్తున్నాయని, గ్రామంలో గల కొనుగోలుదారులే ధాన్యం సేకరించి లాభాలను ఆర్జిస్తున్నారని పలువురు రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ట్రాన్స్‌పోర్ట్, హమాలీ చార్జీలు వారికే వెళ తున్నాయన్నారు. వీటిని రైతులకు అందేలాగా అధికారులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు. లేకుంటే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం మద్దతు ధర ప్రకటించాలని, దళారులకు ప్రభుత్వం అందించే రాయితీలు దళారులకు అందకుండా రైతులు కాదే విధంగా చర్యలు తీసుకోవాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వారి ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఓటు నమోదుపై అవగాహన

ప్రజాశక్తి-అయినవిల్లి

ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని తహశీల్దార్ నాగ లక్ష్మమ్మ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చేపట్టిన ఓటర్ల నమోదు ఈ నెల 4,5 తేదీల్లో నిర్వహించే ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకావాలన్నారు. 18 ఏండ్లు నిండిన వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. పై తేదీలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అయినవిల్లి మండలం లోని ప్రతి పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారులు అందుబాటు లో ఉంటారన్నారు. డ్రాఫ్ట్ ఓటర్ లిస్టు లో ఏ విధమైన అభ్యంతరాలు ఉంటే సరైన ధ్రువపత్రాలు తో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అవగాహన కల్పిస్తున్నా తహశీల్దార్ నాగ లక్ష్మమ్మ

నేటి నుంచి ఓటర్ల ప్రత్యేక నమోదు

యానాం : పుదుచ్చేరివ్యాప్తంగా అక్టోబరు 27న ప్రారంభించిన ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా ఈ శని, ఆదివారాల్లో యానాంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం జరుగుతుందని పుదుచ్చేరి ప్రధాన ఎన్నికల అధికారి పి.జవహర్ తెలిపారు. ఈ అవకాశాన్ని యువత, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

బాణసంచా తయారీ కేంద్రాల పరిశీలన

బిక్కవోలు : బలబద్రపురం, బిక్కవోలు గ్రామాల్లో బాణా సంచా సామాగ్రిని తయారు చేసే కేంద్రాలను అనపర్తి అగ్నిమాపక అధికారి శ్రీనివాస్ రెడ్డి, బిక్కవోలు తహశీల్దార్ పోసుబాబు, ఎస్ఐ బుజ్జిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా బాణా సంచాను తయారు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కేంద్రాల్లో నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు.

పూర్తి స్థాయిలో నాణ్యతా ప్రమాణాల నిర్ధారణ

సామర్లకోట రూరల్ : జిల్లాలో రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యత విషయములో మోసపోకుండా పూర్తిస్థాయిలో నిర్ధారణ చేసేందుకు చర్యలు చేపట్టామని జెసి ఇలాక్కియా తెలిపారు. ఇందు కోసం 275 టెక్నికల్ అసిస్టెంట్లు, 275 మంది ఆపరేటర్లనును నియమించామన్నారు. శుక్రవారం పిబి.దేవంలో ఆమె మాట్లాడారు. ఆర్‌బికెలు, రైసు మిల్లుల వద్ద ఒకే రకమైన తేమశాతం చూసే యంత్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆర్‌బికె వద్ద నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు మాత్రమే పరిగణిస్తారన్నారు. మిల్లరు ఏమైనా నాణ్యతకు సంబంధించి అంశాలు లేవనెత్తితే మిల్లు వద్ద నున్న కస్టోడియన్ అధికారి, మండల స్థాయి సిబ్బంది వాటిని పరిష్కరిస్తారన్నారు. ఒకసారి ఎఫ్‌టిఒను రైతుకు అందించిన తరువాత రైతు మిల్లుకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. మద్దతు ధర కల్పించడంతో పాటు, గోనె సంచుల వినియోగానికి, హమాలీలకు, రవాణాకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందన్నారు. మిల్లుకు పంపిన వాహనంలో ధాన్యాన్ని 3 గంటల్లోగా అన్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. జిపిఎస్ అమర్చని వాహనాలను ధాన్యం రవాణాకు వినియోగించరాదన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ పుష్పమణి, ఎడిఎ జివి.పద్మశ్రీ, జిల్లా టెక్నికల్ అధికారి విజయ రాజు, ఎంపిడిఒ, తహశీల్దార్, ఎఒ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రక్షణ భేరి పోస్టర్ ఆవిష్కరణ

ఏలేశ్వరం : అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం నవంబర్ 15న విజయవాడలో నిర్వహించే ప్రజా రక్షణ భేరి బహిరంగ సభను విజయవంతం కోరుతూ ప్రత్తిపాడులో పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకుడు రొంగల ఈశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.శ్రీను, ఎస్.సత్తిబాబు, కె.సతీష్, పి.రమణ, సురేష్, వరలక్ష్మి ఉన్నారు.

9 వరకు వల్లభ స్వామి దర్శనం నిలిపివేత

పెద్దాపురం : మండలంలోని తిరుపతిలోని శృంగార వల్లభస్వామి ఆలయ గర్భాలయంలో మరమ్మతులు కారణంగా ఈనెల 9 వరకు మూల విరాట్ దర్శనం నిలిపి వేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పులి నారాయణమూర్తి తెలిపారు. అప్పటివరకు ఉత్సవమూర్తులతో దర్శనం ఏర్పాటు చేశామన్నారు. 10వ తేదీ నుంచి యథావిధిగా మూలవిరాట్ దర్శనం ఉంటుందన్నారు. యాత్రికులు, భక్తులు గమనించాలన్నారు.

ఆదిత్యలో '5జి సర్వీసెస్'పై శిక్షణ

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం 5జి రంగంలో వినియోగించే 5జి అప్లికేషన్, వినియోగించే పద్ధతిపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇసిఇ విభాగానికి చెందిన డాక్టర్ తాతబాబు అద్దేపల్లి శిక్షణ అధిపతిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస్‌రెడ్డి, ఐఐసి, ఇడిసి కన్వీనర్ డాక్టర్ పిఎస్.రంజిత్, కో-ఆర్డినేటర్ డాక్టర్ అనిల్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ వి.సునీత పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 94432
కాకినాడ, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99189

జర్నలిజం పట్ల ఆసక్తి, సామాజికస్పృహ ఉన్నాయా?
మీరు విన్నదీ కన్నదీ పది మందితో
పంచుకుందామనుకుంటున్నారా?
ప్రజాశక్తి
అయితే దరఖాస్తు పంపండి
విలేకర్లు కావలెను
దినపత్రికలో పనిచేసేందుకు
క్రింది తెలిపిన కేంద్రాల్లో విలేకర్లు కావలెను
◆ రాజమండ్రి సిటీ ◆ రాజమండ్రి కార్పొరేషన్ ◆ రాజమండ్రి క్రైం
◆ కోరుకొండ ◆ రంగంపేట ◆ కిర్లంపూడి ◆ కాజులూరు
◆ కాకినాడ కార్పొరేషన్ ◆ కాకినాడ భానుగుడి ◆ పెద్దాపురం రూరల్
◆ తుని ◆ తుని రూరల్ ◆ తొండంగి ◆ ప్రత్తిపాడు ◆ గొల్లప్రోలు ◆ పి.గన్నవరం
◆ ముమ్మిడివరం ◆ అల్లవరం ◆ రాయవరం ◆ కె.గంగవరం ◆ మలికిపురం
◆ సఖినేటిపల్లి ◆ అనపర్తి ◆ నిడదవోలు రూరల్
విలేకర్లకు అర్హత
ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజం పట్ల ఆసక్తి,
సమస్యల పట్ల అవగాహన
ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో
బయోడేటాను మెయిల్ చేయాలి
prajagodavari@gmail.com
సంప్రదించాల్సిన నెంబర్లు 92918 01804, 94900 99169

ఆటో వర్కర్ల యూనియన్ జిల్లా సమావేశం

ప్రజాశక్తి-అమలాపురం

ఆంధ్ర ఆటోవాలా ఆటో వర్కర్స్ యూనియన్ అమలాపురం 9 సెంటర్ల కమిటీ మెంబర్స్ విస్తతస్థాయి సమావేశం శుక్రవారం ఈదరపల్లి ఆటో యూనియన్ ఆఫీసులో జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు వాసంశెట్టి సత్తిరాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ఎఐటియుసి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కెఎస్.బాబు హాజరయ్యారు. ముఖ్యంగా జిల్లా యూనియన్ సమావేశంలో మండలం, డివిజన్ స్థాయిలో, ఆటో యూనియన్ నూతన కమిటీల నియామకం ఉండాలని తీర్మానించారు. ఆ ప్రకారంగా డివిజన్ స్థాయి కమిటీ సభ్యులకు సమావేశం ఏర్పాటు చేశారు. కెఎస్.బాబు ప్రసంగించారు. ఈసందర్భంగా పలు తీర్మానాలు చేశారు. యూనియన్ కార్యకలాపాలు, డివిజన స్థాయిగా చూసేందుకు ఒక తాత్కాలిక కమిటీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సత్తిరాజు సమక్షంలో నియమించారు. బొలిశెట్టి శంకర్, ఎఐటియుసి నాయకుడు ఈ కమిటీకి తాత్కాలిక కన్వీనర్ గా నియమిస్తూ కమిటీ సభ్యులుగా రాయుడు ప్రసాద్, కాళ్ల భీమరాజు,, బొక్క నాని, రావూరి రాంబాబు, పడుచూరి చిన్న తదితరులను వీరిని కమిటీ సభ్యులుగా నియమిస్తూ తీర్మానించారు.

అగ్ని ప్రమాద బాధితునికి లయన్స్ క్లబ్ సాయం

ప్రజాశక్తి అమలాపురం రూరల్

రోళ్లపాలెం గ్రామంలో రాయుడు సత్తిబాబు తాటాకు ఇల్లు ఇటీవల విద్యుత్తు షార్క్ సర్క్యూట్ కారణంగా అగ్నికి ఆహుతి అయింది. బాధిత కుటుంబానికి శుక్రవారం రోడ్లపాలెంలో లయన్స్ క్లబ్ సభ్యులు సమకూర్చిన కిరణా సరుకులు, 25 కేజీల బియ్యం ప్యాకెట్లు అందజేశారు. ప్రెసిడెంట్ లయన్ జివిఎస్ మల్లిబాబు మాట్లాడుతూ నిస్సహాయులకు సహాయం చేయడానికి లయన్స్ క్లబ్ ఎప్పుడు ముందుంటుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ లయన్ చిక్కాల సతీష్, లయన్ పట్నాల వెంకటరమణ, లయన్ షేక్ నౌషాద్, లయన్ గుమ్మళ్ళ తాతయ్యకాపు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

విజేతలకు బహుమతులు అందజేసిన దృశ్యం

వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-రామచంద్రపురం

పోలీస్ అమర వీరుల వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలంలోని మోడ్రన్ డిగ్రీ కాలేజ్, పలుస్కూళ్లలో సిఐ వి.దుర్గారావు, ఎస్ఐ సురేష్ బాబు ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు, డిబేట్ నిర్వహించారు. వీటితోపాటు రామచంద్రపురం సర్కిల్ సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శుక్రవారం విజేతలకు రామచంద్రపురం డిఎస్‌పి టిఎస్ఆర్ కె.ప్రసాద్ చే బహుమతులుఅందజేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎంపి చింతా అనురాధ సమకూర్చిన రూ.5 లక్షలతో గొల్లవిల్లి పంచాయతీ అశోక్ నగర్ దళితపేటలో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దొంగ కనకదుర్గ, పంచాయతీ వార్డు సభ్యులు దొంగ శ్రీను, చప్పిడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

గోగిపేటలో డ్రెయినేజీ నిర్మాణ పనులు

ప్రజాశక్తి-కొత్తపేట

గ్రామ సచివాలయ నిధులతో నిర్మించే డ్రైనేజీ నిర్మాణ పనులను శుక్రవారం జెడ్‌పిటిసి సభ్యురాలు గూడపాటి రమాదేవి, సర్పంచ్ బూసి విజయలక్ష్మిలు ప్రారంభించారు. గోగిపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించిన ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డికిపలు సమస్యలను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయన స్పందించి గ్రామస్తులు ఇచ్చిన హామీ ప్రకారం సచివాలయం పరిధి నిధుల నుంచి కేటాయించారు. సుమారు రూ.4లక్షలతో డ్రైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు.

మహారాజశ్రీ రాజమండ్రి 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 448/2017

బిట్వీన్:
1) టేకి రాము
2) టేకి కుమారి ...వాదులు

VS

1) కాలేపు వరలక్ష్మి (డైడ్)
2) వై.దుర్గా భవాని
3) యు.పద్మావతి
4) కె.వి.వి.నాగరాజు
...ప్రతివాదులు

పై నెంబరు దావాలో మీరు 3వ ప్రతివాది అయిన ఉన్నారు. కోర్టు ద్వారా మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించినను మీరు పుచ్చుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా తిప్పి పంపించుచున్నారు. కాబట్టి మీయొక్క హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు వాయిదాను ది. 20-11-2023వ తేదీకి వేసినారు. కావున మీరు **ది.20-11-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు** స్వయంగా గాని, **మీప్లీడరు ద్వారా గాని హాజరయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను.** లేనిఎడల మీ పరోక్షమునందు తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 20-11-2023

శ్రీ తోట వెంకటేశ్వరరావు
శ్రీ కొలసాని కనకదుర్గ
శ్రీ తోట పవన్ కళ్యాణ్
అడ్వకేట్స్, కొవ్వూరు.
సెల్: 73969 17878